
# సవాల్‌గా భూసేకరణ!

- ముందుకు సాగని గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ నిర్మాణం
- 38.200కిమీ నిర్మాణానికి సేకరించాల్సిన భూమి 176.54 హెక్టార్లు
- ఇప్పటివరకు 160 హెక్టార్ల భూమిని సేకరించి అవార్డు పాస్
- 1066 మందిలో పరిహారం తీసుకున్నది 168 మంది రైతులే..
- రూ.60.15 కోట్లు కేటాయించగా చెల్లించిన పరిహారం రూ.10.33 కోట్లే..
- ధరల వ్యత్యాసంతో భూములను ఇచ్చేందుకు ససేమిరా అంటున్న రైతులు
- సమస్య పరిష్కరించాలని సీఎం ఆదేశాలు.., అయోమయంలో అధికారులు



వరంగల్, జూలై 21(నమస్తేతెలంగాణ) : జాతీయ రహదారి గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ 163(జీ) నిర్మాణం కోసం భూసేకరణ అధికారులకు సవాల్‌గా మారింది. ధరల వ్యత్యాసం వల్ల రైతులు తమ భూమిని ఇచ్చేందుకు ముందుకురావడం లేదు. ఇప్పటివరకు అధికారులు జిల్లాలో 1,066 మంది రైతుల నుంచి సుమారు 160 హెక్టార్ల భూమిని సేకరించి అవార్డు పాస్ చేయగా, కేవలం 168 మంది రైతులు మాత్రమే పరిహారం డబ్బు తీసుకున్నారు. ప్రభుత్వం చెల్లిస్తామంటున్న ధర తక్కువగా ఉందని మిగతా రైతులు ససేమిరా అంటున్నారు. భూసేకరణ విషయంలో మానవీయ కోణంలో ముందుకెళ్లాలని ప్రభుత్వం చెబుతున్నా రైతుల డిమాండ్, సర్కారు చెల్లిస్తామంటున్న ధర మధ్య తేడా ఈ వ్యవహారం ముందుకు సాగడం లేదు.

**జిల్లాలో 38.200 కిమీ**

జిల్లాలో జాతీయ రహదారి గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ 163(జీ) 38.200కిమీ నిర్మాణం జరగనుందని అధికారులు గుర్తించారు. దీనికోసం 176.54 హెక్టార్ల భూమిని సేకరించాల్సి ఉంది. ఇందులో 5.96 హెక్టార్లు ప్రభుత్వానిదికాగా మిగతాది రైతుల భూమి. వరంగల్ రెవెన్యూ డివిజన్ పరిధిలో గీసుగొండ, ఊకల్, మచ్చాపూర్, బొడ్డుచింతలపల్లి, మనుగొండ, సంగెం, తిమ్మాపూర్, చింతలపల్లి, తీగరాజుపల్లి, ఏనుగల్, చింతనెక్కొండ, నర్సంపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని నెక్కొండ, అప్పల్‌రావుపేట, అలంకానిపేట, పత్తిపాక, తోపనపల్లి, చంద్రుగొండ, వెంకటాపూర్ గ్రామాల్లో మొత్తం 38.200 కిమీ గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ నిర్మాణం కోసం 176.54 హెక్టార్ల భూమిని సేకరించాల్సి ఉండగా ఇప్పటివరకు అధికారులు 1,066 మంది రైతుల నుంచి 154.65 హెక్టార్ల భూమిని సేకరించారు. ఈ భూమికి అవార్డు పాస్ చేశారు. 1,066 మంది రైతుల్లో 168 మంది రైతులకు సుమారు రూ.10.33 కోట్ల పరిహారం చెల్లించినట్లు ఈ నెల 10న నేషనల్ హైవేస్ కోసం భూసేకరణలో సమస్యలపై సమీక్ష నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డికి జిల్లా నుంచి పాల్గొన్న అధికారులు చెప్పారు.

రైతులు కోరుతున్న ధర, ప్రభుత్వం ఇస్తామంటున్న ధరలో వ్యత్యాసం ఉండడం వల్ల రైతులు తమ భూములను ఇచ్చేందుకు ముందుకు రావడం లేదని తెలిపారు. రైతులతో మరోసారి మాట్లాడి ఈ నెలాఖరులోగా భూసేకరణ సమస్యను పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ చెప్పారు. ఆ తర్వాత అధికారులు భూసేకరణలో తలెత్తిన సమస్యలను పరిష్కరించడంపై దృష్టి సారించారు.

**రైతుల ససేమిరా**

జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ నిర్మాణం జరిగే గ్రామాల్లో భూములకు డిమాండ్ ఉంది. ప్రధానంగా వరంగల్ మహానగరం శివారులో ఉన్న గీసుగొండ, సంగెం తదితర మండలాల్లోని గ్రామాల్లోని భూములకు అధిక ధర పలుకుతోంది. ఈ మండలాల్లోని గ్రామాలు వరంగల్- నర్సంపేట ప్రధాన రహదారికి, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు సమీపంలో ఉన్నాయి. అంతేకాదు వరంగల్-నర్సంపేట ప్రధాన రోడ్డును ఆనుకుని ఉన్న భూములకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. పర్వతగిరి, నెక్కొండ మండలాల్లోని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి. ఈ నేపథ్యంలో జిల్లాలో భూములను కోల్పోయే రైతులు తమకు ఈ భూములే జీవనాధారమని, దీనికితోడు ప్రభుత్వం మార్కెట్ రేటు కూడా ఇస్తామనకుండా సర్కారు నిర్ణయించిన ధర చెల్లిస్తామనడాన్ని వ్యతిరేకిస్తున్నారు. ప్రభుత్వం చెల్లిస్తామంటున్న ధర, రైతులు అడుగుతున్న ధర నడుమ వ్యత్యాసం ఎక్కువగా ఉండటం వల్ల జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ నిర్మాణం కోసం భూసేకరణ ముందుకు సాగడం లేదు. ఈ రోడ్డు నిర్మాణానికి ఇప్పటివరకు అధికారులు అవార్డు పాస్‌చేసిన 154.64 హెక్టార్ల భూముల రైతులకు చెల్లించేందుకు ప్రభుత్వం జిల్లాకు సుమారు రూ.60.15కోట్లకుపైగా నిధులు కేటాయించింది. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం పరిహారం తీసుకోవడానికి సంబంధిత రైతులు ముందుకు రాకపోవడంతో సుమారు రూ.49.81 కోట్లు నిల్వ ఉండిపోయాయి. ముఖ్యమంత్రి ఆదేశాలతో కొద్దిరోజుల నుంచి అధికారులు గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ నిర్మాణం కోసం ఇప్పటికే సేకరించిన భూముల రైతులకు నచ్చజెప్పి వారు పరిహారం తీసుకునేలా ప్రయత్నిస్తున్నారు. భూములను కోల్పోతున్న రైతుల్లో అత్యధిక మంది మాత్రం తమ భూములను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వబోమని తేల్చి చెబుతున్నట్లు తెలిసింది. దీంతో భూసేకరణ సమస్యను పరిష్కరించడం అధికారులకు ఇప్పుడు పరీక్షగా మారింది.

**రైతులకు నచ్చజెపుతున్నం... కృష్ణవేణి, ఆర్డీవో**

గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ నిర్మాణంతో భూములు కోల్పోనున్న రైతులతో మాట్లాడుతున్నం. భూమి ఇచ్చేలా వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నాం.

ప్రస్తుతం ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం పరిహారం తీసుకున్న రైతులకు తర్వాత సెక్షన్ 64 కింద పరిహారాన్ని పెంచే అవకాశం ఉంటుంది. పరిహారం తీసుకోవడానికి కొందరు రైతులు ముందుకొస్తున్నారు.



రామప్ప సరస్సు వద్ద గల ఆలయం ముందు విరిగిపడిన చెట్టు

## రామప్పలో శివాలయం ముందు కూలిన చెట్టు

*వారం రోజులుగా పట్టించుకోని అధికారులు*

వెంకటాపూర్, జూలై 21: పాలంపేట గ్రామంలోని రామప్ప చెరువు కట్టపై ఉన్న శివాలయం ముందు కూలిన చెట్లను తొలగించి పురాతన కట్టడాలను కాపాడాలని పర్యాటకులు కోరుతున్నారు. వారం రోజుల క్రితం అర్ధరాత్రి సమయంలో రామప్ప చెరువు కట్టపై బోటింగ్ పాయింట్ వద్ద శివాలయానికి ఆనుకొని ఉన్న వృక్షం కొమ్మలు విరిగి ఆలయం ఎదుట పడ్డాయి. పగటి సమయంలో విరిగిపడితే పర్యాటకులు గాయపడేవారని, అధికారులు స్పందించి వెంటనే కొమ్మలు తొలగించకపోతే ఆలయం దెబ్బతినే ప్రమాదముందని పర్యాటకులు చెబుతున్నారు.

## గార్ల పీఏసీఎస్‌లో 799 మందికే రుణమాఫీ

గార్ల, జూలై 21: గార్ల పీఏసీఎస్ పరిధిలో 2,513 మంది రైతులుండగా, 2,123 మంది రూ.లక్షలోపు రుణం తీసుకున్నట్లు సీఈవో సింగు వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో 799 మందికి మాత్రమే రుణమాఫీ జరిగినట్లు పేర్కొన్నారు. పీఏసీఎస్ పరిధిలో 40 శాతం మాత్రమే రుణమాఫీ జరిగిందని, మిగతా రైతులకు సైతం మాఫీ జరుగుతుందని, ఆందోళన చెందవద్దని వెంకటేశ్వర్లు తెలిపారు.

## ఎనుమాముల మార్కెట్‌కు ముగ్గురు సూపర్‌వైజర్లు

కాశీబుగ్గ, జూలై 21: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీకి ముగ్గురు సూపర్‌వైజర్లు బదిలీపై వచ్చారు. జిల్లావ్యాప్తంగా చేపట్టిన మార్కెట్ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ పూర్తయింది. ఇందులో భాగంగా వర్ధన్నపేట మార్కెట్ కమిటీలో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న చక్రబహుదూర్ రాయ్, నర్సంపేట మార్కెట్ నుంచి ఎండీ సలీం, ఏఎంఎస్ రజిత, నెక్కొండ మార్కెట్ నుంచి జ్యోతిప్రకాశ్ ఎనుమాముల మార్కెట్‌కు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న సూపర్‌వైజర్లు ముడిదె శివకుమార్, ఎర్రం రమణ, అటెండర్లు మోహెనూర్‌బీ, పద్మ, ఏఎంఎస్ మైదం కన్నయ్య, జేఎంఎస్ శ్రీనివాసరావు నర్సంపేట మార్కెట్‌కు బదిలీ అయ్యారు. అలాగే, సూపర్‌వైజర్లు భూక్యా వెంకన్ననాయక్ వర్ధన్నపేటకు, ఎర్రం వంశీకృష్ణ నెక్కొండ మార్కెట్‌కు బదిలీ అయ్యారు.

## సెల్యూట్ పోలీస్

- నిరుపేద కుటుంబానికి ఇల్లు నిర్మాణం
- మానవత్వం చాటుకున్న ఎస్సై గండ్రాతి సతీశ్



పెద్దనాగారంలో నిర్మిస్తున్న ఇల్లు

నర్సింహులపేట, జూలై 21: గూడు లేక ఇబ్బంది పడుతున్న కుటుంబానికి సొంత ఖర్చుతో ఇల్లు నిర్మించి మానవత్వాన్ని చాటుకున్న ఎస్సై గండ్రాతి సతీశ్‌కు మండల ప్రజలు సెల్యూట్ చేస్తున్నారు. మండలంలోని పెద్దనాగారం గ్రామానికి చెందిన మందుల నాగన్నకు చూపు లేకపోవడంతోపాటు చెవులు కూడా వినిపించవు. పాటలు పాడుకుంటూ పొట్టపోసుకుంటున్నాడు. నాగన్న అతడి తల్లి బక్కమ్మ సహకారంతో గ్రామాలు తిరుగుతూ జీవనం సాగిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై సతీశ్ వారి కుటుంబాన్ని పరిశీలించారు. పరిస్థితి చూసి చలించిపోయి రూ.లక్షా50వేలు తన సొంత ఖర్చుతో పాత ఇంటిని తీసివేసి నూతనంగా ఇంటిని నిర్మిస్తున్నాడు. గతంలో పాలకుర్తి మండలంలో పని చేసిన సమయంలో లక్ష్మినారాయణపురం గ్రామంలో ఓ వృద్ధురాలికి ఇంటి నిర్మించి ఇచ్చాడు.

- ఇదీ బొల్లికుంట ప్రాథమికోన్నత పాఠశాల తీరు
- సర్కారు విద్యపై సన్నగిల్లుతున్న నమ్మకం



బొల్లికుంటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

## ఇద్దరు పంతుళ్లు.. ఇద్దరే పిల్లలు!

ఖిలావరంగల్, జూలై 21: సర్కారు విద్యపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తామనే భరోసాను ఇటు ప్రభుత్వం.. అటు ఉపాధ్యాయులు ఇవ్వకపోవడంతో తల్లిదండ్రులు వేల రూపాయలు ఖర్చు చేసి తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్లకు పంపిస్తున్నారు. బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని విద్యాహక్కు చట్టం చెబుతున్నా అది క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఖిలావరంగల్ మండలం బొల్లికుంట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు లేక వెలవెలబోతున్నది. స్కూల్‌లో రెండు తరగతి గదులు, హెచ్‌ఎంకు ఒక గది ఉంది. ఇక హాజరు పట్టికలో నలుగురు విద్యార్థులు ఉన్నారు. కానీ, హాజరయ్యేది ఇద్దరు విద్యార్థులు మాత్రమే. ఆ ఇద్దరి బోధించేందుకు ఇద్దరు ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారు. కాగా, 3, 4వ తరగతి చదువుతున్న ఆ ఇద్దరు విద్యార్థులు కూడా శుక్రవారం స్కూల్‌కు డుమ్మా కొట్టడంతో ఉపాధ్యాయులే సమయానికి పాఠశాలకు వచ్చి, సాయంత్రం వరకు ఉండి వెళ్లడం గమనార్హం.

## శబరిమలైలో పూజల నిర్వహణకు విష్ణు ఎంపిక



విష్ణు నారాయణపొట్టి

కేసముద్రం , జూలై 21 : కేరళ రాష్ట్రంలోని శబరిమలై సన్నిధానంలో ఉన్న దేవాలయాల్లో పూజలు నిర్వహించేందుకు విష్ణు నారాయణపొట్టి అనే పూజారి ఎంపికయ్యాడు. కేరళ రాష్ట్రం కొల్లం జిల్లాకు చెందిన విష్ణు నారాయణ పొట్టి రెండేళ్ల నుంచి కేసముద్రం మండల కేంద్రంలోని ఉప్పరపల్లి రోడ్డులో ఉన్న శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో పూజారిగా (ప్రధాన తాంత్రి వర్యులు) పని చేస్తున్నాడు. కేరళ రాష్ట్రంలోని ట్రావెల్ కోర్ దేవస్థానం బోర్డు ప్రభుత్వ ఆధీనంలో ఉన్న దేవాలయాల్లో పూజారుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. గతేడాది నిర్వహించిన పరీక్షా పోటీల్లో విష్ణు నారాయణ పొట్టి పాల్గొన్నాడు. ఈ నెల 20న విడుదల చేసిన పరీక్షా ఫలితాల్లో విష్ణు నారాయణ పొట్టి ఉద్యోగం పొందాడు.

## వడ్లకొండలో గోడ కూలి మహిళ మృతి



గుండె రమ(ఫైల్)

జనగామ, జూలై 21(నమస్తే తెలంగాణ): జనగామ మండలం వడ్లకొండలో ఆదివారం పాత గోడ కూలిన ఘటనలో మహిళా కూలి తీవ్ర గాయాల పాలై చికిత్స పొందుతూ మృతి చెందింది. వడ్లకొండకు చెందిన గుండె పౌల్ ఇంటి వద్ద ప్రహరీ నిర్మాణం కోసం గుండె రమ (38)తోపాటు ఇద్దరు కూలీలు పునాది తీస్తుండగా పాత గోడ వీరిపై కూలడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వీరిని జనగామ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ దవాఖానకు తరలించి చికిత్స అందించారు. అయితే వీరిలో రమ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. రమ భర్త మల్లేశ్ ఫిర్యాదు మేరకు జనగామ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పునరావాస కేంద్రానికి 21 మంది తరలింపు




పునరావాస కేంద్రంలో భోజనం వడ్డిస్తున్న సిబ్బంది


మంగపేట, జూలై 21 : ములుగు జిల్లా మంగపేట మండలం మారుమూల గ్రామం నర్సింహసాగర్‌లో శిథిలావస్థకు చేరిన ఐబీ గెస్ట్‌హౌస్ గదుల్లో నివసిస్తున్న 13 కుటుంబాల్లోని 21 మందిని ఆదివారం రాత్రి అధికారులు స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వారు నివసిస్తున్న గదులు దెబ్బతిన్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారిని పునరావాస కేంద్రానికి తరలించి తగిన ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ వీరస్వామి తెలిపారు.

# ఆటుపోట్లకు ఆస్కారం

మార్కెట్ పల్స్

**దేశీయ** స్టాక్ మార్కెట్లలో గత వారం సైతం నూతన రికార్డులు నమోదయ్యాయి. అయితే వరుస లాభాలతో సూచీలు గరిష్ఠ స్థాయిల్లో కదలాడుతున్న వేళ.. మదుపరులు లాభాల స్వీకరణ దిశగా అడుగులు వేశారు. దీంతో ఓవరాల్‌గా స్వల్ప లాభాలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 85.31 పాయింట్లు పెరిగి 80,604.65 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 28.75 పాయింట్లు అందుకుని 24,530.90 దగ్గర ముగిసింది. శుక్రవారం భారీ నష్టాలు వాటిల్లకపోతే సూచీలు నయా ఆల్‌టైమ్ హైల్లోనే ఉండేవి. ఇక ఈ వారం కూడా మదుపరులు ఆయా సంస్థల త్రైమాసిక ఆర్థిక ఫలితాల ఆధారంగా తమ పెట్టుబడులపై నిర్ణయం తీసుకునే వీలున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్) కోసం కంపెనీలు తమ ఫైనాన్షియల్ రిజల్ట్స్‌ను ప్రకటిస్తున్న విషయం తెలిసిందే. అయినప్పటికీ సూచీలు రికార్డుస్థాయి గరిష్ఠాల్లో ఉన్నందున పెట్టుబడులు-ఉపసంహరణల మధ్య ఇన్వెస్టర్లు కొట్టుమిట్టాడేందుకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కాగా, గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఎప్పట్లాగే ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,200 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 23,900 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 24,700-24,900 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.






# రాబడి

# ఆఖర్లో కాదు..

## రుణ చెల్లింపుల్లో లాభం ఇలా





**మనలో** ప్రతి ఒక్కరూ ఎప్పుడో ఒకప్పుడు బ్యాంకుల్లో లేదా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల్లో రుణాన్ని తీసుకోవడం సహజం. అయితే ఆ రుణ భారాన్ని వీలైనంత త్వరగా తీర్చేసుకుందామనుకొని కొన్ని పొరపాట్లు చేస్తూంటారు. దీనివల్ల నష్టాల పాలవుతూంటారు. అందుకే రుణ చెల్లింపుల విషయంలో ఎప్పుడు? ఎలా? అన్నది అత్యంత ముఖ్యమైన అంశం. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల్లో లోన్లు తీసుకున్నప్పుడు.. వడ్డీతో కలిపి ఆ మొత్తాన్ని నిర్ణీత లేదా రుణగ్రహీత ఎంచుకున్న కాలవ్యవధికి సమాన ఈఎంఐలుగా పంచుతారు. అయితే ఈ నెలవారీ వాయిదాల్లో మొదట చెల్లిస్తూపోయే వాటిలో ఎక్కువ మొత్తం రుణంపై రుణదాతలు వసూలుచేసే వడ్డీనే ఉంటుంది. కాలం గడుస్తున్నకొద్దీ చివర్లో ఉండే ఈఎంఐల్లో వడ్డీకన్నా అసలే ఉంటుంది. అంటే.. రుణం తీసుకున్న తొలినాళ్లలో చెల్లించే ఈఎంఐల్లో ఎక్కువ మొత్తం వడ్డీ కిందనే పోతుంది. అసలు రుణంలో మైనస్ అయ్యేది చాలా తక్కువ. అలాగే ఆఖర్లో చెల్లించే ఈఎంఐల్లో వడ్డీకన్నా అసలు రుణమే ఎక్కువగా ఉంటుంది. కాబట్టి రుణ భారం తగ్గించుకోవాలనుకునేవారు మొదట్లోనే వీలైనంత చెల్లించడం మంచిది. ఆఖర్లో ఒకేసారి చెల్లించడం కన్నా ఈఎంఐలను అనుసరించడమే లాభదాయకం.

**లోన్ పోర్టబులిటీ**

రుణాలపై వివిధ బ్యాంకులు, సంస్థలు రకరకాల వడ్డీరేట్లను అనుసరిస్తాంటాయి. రుణగ్రహీత సిబిల్ స్కోర్‌తోపాటు మరి కొన్ని అంశాలు ఇందులో ప్రధాన పాత్ర పోషిస్తాయి. అయితే మనం తీసుకున్న రుణంపై వడ్డీరేటు ఎక్కువగా ఉందనుకుంటే.. ఎందులో తక్కువగా ఉందో తెలుసుకుని ఆ మొత్తం రుణాన్ని అక్కడికి మార్చుకోవడం ఉత్తమం. దీన్నే లోన్ పోర్టబులిటీ అం టారు. దీనివల్ల వడ్డీ భారం తగ్గుతుంది. కానీ ఈ ప్రక్రియకు కొన్ని చార్జీలు వర్తిస్తాయి. వీటన్నిటినీ కలిపి లెక్కించే రుణాన్ని ఒక సంస్థ నుంచి మరో సంస్థకు మార్చుకోవడం లాభమా? నష్టమా? అన్నది తేల్చుకోవాలి. లేకపోతే భారం మరింత పెరిగే ప్రమాదం ఉన్నది.

# ఐటీఆర్‌లో సెక్షన్‌తో కొడదాం

***ఇది ఆదాయ పన్ను రిటర్న్ (ఐటీఆర్)ల కాలం. 2023-24 ఆర్థిక సంవత్సరానికి (2024-25 మదింపు సంవత్సరం) గాను ఈ నెలాఖర్లోగా (జూలై 31) ఐటీఆర్‌ను దాఖలు చేయాల్సి ఉంటుంది. దీంతో పన్ను ఆదా కోసం ఉన్న మార్గాలను అంతా వెతుకుతున్నారు. అయితే అందరికీ తెలిసింది సెక్షన్ 80సీ మాత్రమే. కానీ ఐటీ చట్టంలోని వివిధ సెక్షన్ల కింద రకరకాల పెట్టుబడులు, ఖర్చులు, రుణాల చెల్లింపులు, వడ్డీ ఆదాయాలపై పన్ను మినహాయింపును పొందవచ్చు. వాటిని పరిశీలిస్తే..***




### 1. నేషనల్ పెన్షన్ సిస్టమ్

నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)లో పెట్టుబడులకు సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షలదాకా పన్నును ఆదా చేసుకోవచ్చు. ఇక సెక్షన్ 80సీసీడీ (1బీ) కింద అదనంగా మరో రూ.50,000 ఆదా చేయవచ్చు. మొత్తంగా రూ.2 లక్షలు ఆదా అవుతాయి.

### 2. ఆరోగ్య బీమా

సెక్షన్ 80డీ కింద ఆరోగ్య బీమా ప్రీమియంను క్లెయిం చేసుకోవచ్చు. ఎంత? అన్నది పాలసీ కవరేజీ, వయసుపై ఆధారపడి ఉంటుంది. ఇలా రూ.25,000, రూ.50,000, లక్ష రూపాయల వరకు పన్ను ఆదా చేసుకోవచ్చు.

### 3. విద్యా రుణం

పిల్లల విద్య కోసం రుణం తీసుకున్నట్టయితే.. దాని చెల్లింపులపైనా పన్ను మినహాయింపును క్లెయిం చేసుకోవచ్చు. సెక్షన్ 80ఈ కింద విద్యా రుణంలోని వడ్డీ భాగంపై పన్ను మినహాయింపును పరిమితి అనేదే లేకుండా పొందవచ్చు. రుణాన్ని చెల్లించేది తల్లిదండ్రులా.. పిల్లలా.. అన్న తేడా లేకుండా ఈ ప్రయోజనాన్ని అందుకోవచ్చు.

### 4. హోమ్ లోన్ వడ్డీ

గృహ రుణ చెల్లింపులపై రెండు మార్గాల్లో పన్ను మినహాయింపును క్లెయిం చేసుకోవచ్చు. ఒకటి సెక్షన్ 80సీ కింద అసలుపై రూ.1.5 లక్షల వరకు పన్ను ఆదా చేసుకోవచ్చు. మరొకటి సెక్షన్ 24 కింద వడ్డీ భాగంపై రూ.2 లక్షలదాకా పన్ను ఆదా కోరవచ్చు. కొన్న ఇంట్లో మీరున్నా.. లేదా దానిపై అద్దె ఆదాయం పొందుతున్నా.. పన్ను మినహాయింపులను అందుకోవచ్చు.

### 5. తొలిసారి ఇంటి కొనుగోలుపై

తొలిసారి ఇంటిని కొనుగోలుచేసేవారికి సెక్షన్ 80ఈఈ కింద గృహ రుణ వడ్డీపై కేంద్ర ప్రభుత్వం అదనపు పన్ను ప్రయోజనాలను కల్పిస్తున్నది. ఈ సెక్షన్‌లో రూ.50,000 వరకు ఎక్స్‌ట్రా ట్యాక్స్ క్లెయిములు చేయవచ్చు. సెక్షన్ 24 కింద వర్తించే మినహాయింపులకు అదనం. దీంతో రూ.2.5 లక్షల వరకు ప్రయోజనం ఉంటుంది. అయితే మీ పేరిట అంతకుముందు ఏ ఇల్లూ ఉండరాదు. అలాగే కొనే ఇంటి విలువ రూ.50 లక్షలు మించరాదు. తీసుకునే అప్పు కూడా రూ.35 లక్షలు దాటరాదు.

### 6. హెచ్‌ఆర్‌ఏ

ఉద్యోగులకు వారి సంస్థ యాజమాన్యాలు హౌజ్ రెంట్ అలవెన్స్ (హెచ్‌ఆర్‌ఏ)ను ఇస్తే.. అద్దెపై పన్ను మినహాయింపును పొందవచ్చు. సెక్షన్ 80జీజీ కింద ఈ అవకాశం ఉంటుంది.

### 7. ఎస్‌బీ అకౌంట్ వడ్డీ

సేవింగ్స్ బ్యాంక్ (ఎస్‌బీ) అకౌంట్ నుంచి అందుకునే వడ్డీ ఆదాయంపైనా పన్ను మినహాయింపును కోరవచ్చు. వడ్డీ ఆదాయం రూ.10,000 వరకుంటే సెక్షన్ 80టీటీఏ కింద ఎవరైనా వ్యక్తి లేదా హిందూ అవిభాజ్య కుటుంబం (హెచ్‌యూఎఫ్) ఐటీ ప్రయోజనాన్ని పొందవచ్చు.

### 8. దివ్యాంగుల కేర్ టేకర్‌గా..


మీరు దివ్యాంగుల బాగోగులు చూసుకుంటున్నట్టైతే సెక్షన్ 80డీడీ కింద వారి ఖర్చులపై పన్ను మినహాయింపులను కోరవచ్చు. అంగ వైకల్యాన్నిబట్టి మినహాయింపు ఎంత? అన్నది తెలుస్తుంది. రూ.75,000-రూ.1.25 లక్షల మేర ఉంటుంది.

### 9. వైద్య ఖర్చులకు..

క్యాన్సర్, నరాల వ్యాధులు, ఎయిడ్స్ వంటి రోగాల వైద్య ఖర్చులపైనా ఐటీ మినహాయింపును తీసుకోవచ్చు. సెక్షన్ 80డీడీబీ కింద రూ.40,000 వరకు పన్ను తగ్గింపును పొందవచ్చు. సీనియర్ సిటిజన్లకైతే లక్ష రూపాయలదాకా ప్రయోజనం ఉంటుంది.

### 10. విరాళాలు

విరాళాలపై సెక్షన్ 80జీ కింద పన్ను మినహాయింపును క్లెయిం చేయవచ్చు. అయితే మొత్తం డొనేషన్‌పై ప్రయోజనం రాదు. అలాగే గుర్తింపు పొందిన ఛారిటబుల్ సంస్థకు విరాళం ఇస్తేనే ఈ సౌకర్యం ఉంటుంది.



### *నిల్ ఐటీఆర్‌తో లాభాలివి..*

పన్ను వర్తించే శ్లాబులో మీ ఆదాయం ఉన్నట్టైతే.. ప్రతీ ఆర్థిక సంవత్సరం ఐటీఆర్‌ను తప్పక దాఖలు చేయాల్సిందే. అయితే ఆదాయ పన్ను పరిధిలో మనం లేము కదా.. అని చాలా మంది ఐటీఆర్‌ను లైట్ తీసుకుంటారు. కానీ ఐటీ పరిధిలోకి రాకున్నా.. ఏటా నిల్ ఐటీఆర్‌ను దాఖలు చేస్తే పలు ప్రయోజనాలున్నాయి. 60 ఏండ్లలోపున్నవారికి పాత పన్ను విధానంలోనైతే రూ.2.5 లక్షలు, కొత్త పన్ను విధానంలోనైతే రూ.3 లక్షలదాకా వార్షిక ఆదా యం ఉన్నా పన్నులు చెల్లించనక్కర్లేదు. ఇక నిల్ ఐటీఆర్‌ను దాఖలు చేస్తే వీసా దరఖాస్తుల కోసం ప్రధాన ఆదాయ ధ్రువీకరణగా ఉంటుంది. అలాగే రుణాలను తీసుకునేటప్పుడు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ట్యాక్స్ రిఫండ్స్‌కూ దోహదపడుతుంది.